శారదా నికేతన్ సిబ్బందికి చిరు కానుకలు

కానుకలను అందజేస్తున్న పాఠశాల కమిటీ చైర్మన్

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ముంచంగిపుట్టు శారద నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఉపాధ్యాయులకు, పాఠశాల సిబ్బందిని అభినందిస్తూ డి.శారద ట్రస్టు సౌజన్యంతో చిరుకానుకలను గురువారం పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కొర్ర త్రినాథ్ బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బుజ్జిబాబు, మేనేజ్ మెంట్ సభ్యులు మత్స్యరాజు, దొన్ను , సిబ్బంది, ట్రస్టు సభ్యులు, పాల్గొన్నారు.

పెదబయలు మండల పరిషత్ భవనం

ఎట్టకేలకు ప్రారంభం

భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఫాల్గుణ, పక్కనే కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి- పెదబయలు : ఎట్టకేలకు నిర్మాణం పూర్తి చేసుకున్న పెదబయలు మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని గురువారం స్థానిక ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ, కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రారంభించారు. 2008లో రూ.85లక్షల అంచనా వ్యయంతో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయగా, ఆగుతూ, సాగుతూ నిర్మాణం జరిగింది. నిధుల కొరతతో ఫినిషింగ్ పనులు పూర్తి కాని పరిస్థితులు నెలకొనడంతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చొరవచూపి ఈ ఏడాది రూ.14.95 లక్షల ప్రత్యేక నిధులు కేటాయించి, పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు అప్పగించి, నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఎట్టకేలకు పూర్తయింది.

అరకు ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ మాట్లాడుతూ 15ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న మండల పరిషత్ కార్యాలయభవనం పూర్తి చేసేందుకు జిల్లా కలెక్టర్ చూపిన చొరవ అభినందనీయమన్నారు. భవనంలో రెండో అంతస్తు నిర్మాణానికి తనవంతుగా రూ.10లక్షలు మంజూరు చేస్తానన్నారు.

కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ మండల పరిషత్ భవనంలో సమావేశం మందిరం, అన్ని విభాగాలకు సరిపడా వసతి కోసం రెండో అంతస్తు నిర్మాణం అవసరం ఉందన్నారు. దీనికి తగు చర్యలు చేపడతానన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎల్ పూర్ణయ్య, తహశీల్దార్ కృష్ణారావు, ఇన్‌ఛార్జి ఎఇ శివరామయ్య, సర్పంచ్ పి.మాధవరావు ఎంపిటిసి కె బొంజుబాబు పాల్గొన్నారు

మన్యంలో తెరిపిచ్చిన వర్షం

ప్రజాశక్తి- పాడేరు: పాడేరు ఏజెన్సీలో గురువారం మధ్యాహ్నం నుంచి వరుణుడు కాస్త తెరిపినిచ్చాడు. జిల్లాలో అన్ని మండలాల్లో సెప్టెంబర్ నెలలో ఇప్పటికే ఐదు రోజులు వర్షపాతం నమోదైంది. పాడేరు ఏజెన్సీలో రెండు రోజులుగా ముసురు పట్టినట్లు ఏకధాటిగా వర్షం కురిసింది. ముంచంగిపుట్టు పెద్దబయలు, జీకే వీధి, చింతపల్లి, అనంతగిరి, అరకు మండలాల్లో వర్షం తీవ్రత ఎక్కువగా ఉంది. వర్షం తీవ్రతకు చింతపల్లి, జికె వీధి, అనంతగిరి, పాడేరు అరకు, డుంబ్రిగుడ, పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట, జిమాడుగుల, మండలాల్లో కుండపోత వర్షాలతో రహదారులు లోతట్టు ప్రాంతాలు జలమయమై కనిపించాయి. కొండగెడ్డలు వాగులు ఉదతంగా ప్రవహిస్తున్నాయి. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఏజెన్సీలో జన జీవనానికి కొంత అంతరాయం ఏర్పడింది.

మృతుల కుటుంబాలకు కిడారి పరామర్శ

కాసులమ్మ పాడె మోస్తున్న మాజీ మంత్రి శ్రవణ్ కుమార్

ప్రజాశక్తి- పెదబయలు : మండలంలో అనారోగ్య సమస్యలతో గురువారం మృతి చెందిన పలువురి కుటుంబాలను మాజీమంత్రి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిడారి శ్రావణ్‌కుమార్ పరామర్శించి, వారికి భరోసానిచ్చారు. గోమాంగి పంచాయతీలో ఆదివాసీ గిరిజన సంఘం మాజీ జిల్లాకార్యదర్శి కొమ్మ పృథ్వీరాజ్ తల్లి కాసులమ్మ అనారోగ్యంతో బాధపడుతూ కెజిహెచ్‌లో మృతి చెందింది. మృతదేహాన్ని స్వగ్రామం తీసుకురాగా, గోమంగి వెళ్లి కాసులమ్మ మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించిన శ్రావణ్‌కుమార్, ఆమె అంత్యక్రియల్లో పాల్గొని స్వయంగా పాడే మోసారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. భరోసా కల్పించారు

అంతకుముందు సీకరి గ్రామంలో చెట్టి రంగన్న భార్య సన్యాసమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, ఆ కుటుంబసభ్యులను పరామర్శించారు వనభంగి గ్రామంలో అడకట్ల సరస్వతి మృతికి సంతాపం తెలిపి బాధిత కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో తెలుగు యువత ప్రధాన కార్యదర్శి రామరావు, మండల అధ్యక్షులు బాబూరావు, దారెల సర్పంచ్ పాంగి పాండురంగస్వామి, తెలుగు రైతు ఉపాధ్యక్షుడు కూడా భూషణరావు, టిడిపి నేతలు తిరుపతిరావు,. రామన్నదొర, రాజారావు, బొంజునాయుడు పాల్గొన్నారు.

సచివాలయ పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: గ్రామ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని స్థానిక అల్లూరి యూత్ మండల అధ్యక్షుడు కె.సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయ పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తుందోనని నిరుద్యోగ యువత ఎదురుచూస్తున్నారన్నారు. తక్షణమే ఖాళీగా ఉన్న సచివాలయ పోస్టులతో పాటు ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులు, ప్రత్యేక డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై ప్రత్యేక దృష్టి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు : ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి రెవెన్యూ అధికారులతో ఫారం 8 సేకరణ, వంద సంవత్సరాల పైబడిన ఓటర్లు గుర్తింపు, ఒకే ఇంట్లో 10 మంది ఓటర్లుంటే వాటిని సమగ్ర పరిశీలన, జీరో డోరు నెంబర్ల ఇళ్లపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సేకరించిన ఫారం 6, 7,8 లను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి సచివాలయం సిబ్బంది సేవలను వినియోగించు కోవాలని సూచించారు. ఓటరు జాబితా రూపకల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, పాడేరు, రంపచోడవరం ఐటిడిఎ పిఒలు వి. అభిషేక్, సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, పాడేరు, అరకువ్యాలీ, రంపచోడవరం తాహశీల్దార్లు, ఎలక్షన్ డిప్యూటీ తాహశీల్దారులు పాల్గొన్నారు.

పాడైన రోడ్లతో పరేషాన్!

- వర్షాలకు రాళ్లు తేలి, గోతులమయం
- రాకపోకలకు గిరిజనుల ఇక్కట్లు

భారీ వర్షాలకు కోతకు గురైన రాజుపాక రోడ్డు

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలో ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు మారుమూల గిరిజన గ్రామాల రోడ్లు కోతకు గురై అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీంతో బైక్‌లు, ఆటోలు, ఇతర వాహనాల రాకపోకలకు ప్రజలు ఇబ్బందులకు గురౌతున్నారు.

అనంతగిరి పంచాయతీ, పెద్దూరు నుంచి మాలింగవలస. పాతకోట మీదుగా రేగంనందిగుమ్మి పెద్దబయలు మెయిన్ రోడ్డు వరకు, అలాగే లక్ష్మీపురం మెయిన్ రోడ్డు నుంచి గడ్డగూడ మీదుగా రాజుపాక, అరకుమెయిన్ రోడ్డు నుండి భారజోల, అలాగే పాలసీ లుంగపర్తి పంచాయతీ కరకవలస నుంచి కుంభర్తి, చీడివలస, ఎగువపట్టి అక్కడ నుండి కివర్ల పంచాయతీ బొంగిజా వరకు, జెండగరవు నుండి ఊటగెడ్డ వరకు, అలాగే పెద్దబిడ్డ పంచాయితీ నందులవలస నుండి ధనకోట మీదుగా బి.బంధవలస, గుమ్మ పంచాయతీ నుంచి నిమ్మఊట. ఇలా మండలంలోని అనేక పంచాయతీ గ్రామాల్లో రోడ్లు భారీవర్షాలకు కోతకు గురై రాళ్లు తేలిపోవడంతోపాటు రోడ్లపై పలుచోట్ల మోకాలిలోతు గోతులు, బాటలు ఏర్పడడంతో రాకపోకలకు ఇబ్బందులు పడే పరిస్థితి అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ కూడా రాని పరిస్థితితో మారుమూ గ్రామాల గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.

కోతకు గురైన రోడ్లకు తక్షణం మరమ్మతులు చేపట్టడంతోపాటు, మారుమూల గ్రామాల రోడ్లు కోతకు గురికాకుండా ప్రభావిత ప్రాంతాల్లో శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం

రహదారి మధ్యలో నిలిచిన లారీ : మూడు గంటల పాటు రాకపోకలకు ఇక్కట్లు

ఘాట్‌రోడ్డులో రెండో మలుపు వద్ద నిలిచిన లారీ

ఘాట్‌రోడ్డులో భారీగా ఆగిపోయిన బస్సులు

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని ఘాట్‌రోడ్డు శివలింగపురం, టైడా రెండో మలుపు వద్ద గురువారం మధ్యాహ్నం భారీ లారీ నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మైదాన ప్రాంతం నుంచి భారీ సరుకుల లోడుతో వచ్చిన లారీ సాంకేతిక లోపంతో రోడ్డుకు అడ్డంగా ఆగిపోయింది దీంతో మైదానం, ఏజెన్సీ ప్రాంతాల మధ్య వాహన రాకపోకలకు వీలులేక గంటల తరబడి నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. లారీ డ్రైవర్, క్లీనర్ దాదాపు మూడు గంటలపాటు బాగుచేయడంతో, లారీ స్టార్ట్ అయి, కాస్త పక్కన పెట్టడంతో యథావిధిగా రాకపోకలు సాగాయి. ఏజెన్సీ ప్రాంతంలో ముఖ్యంగా ఘాట్‌రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ స్థాయికి మించిన లోడులతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని పలువురు అంటున్నారు.

నేటి 'స్పందన' రద్దు : పిఒ

ప్రజాశక్తి- పాడేరు : ఈనెల ఎనిమిదో తేదీన శుక్రవారం ఐటిడిఎ నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న అరకులోయలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పర్యటన నేపథ్యంలో ముందుగానే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశామన్నారు. అయితే గవర్నర్ పర్యటన అనివార్య పరిస్థితుల్లో రద్దయినప్పటికీ, స్పందన కార్యక్రమం నిర్వహించడం లేదన్నారు. ఏజెన్సీ ప్రజలు గమనించాలని సూచించారు.

రాష్ట్ర గవర్నర్ అరకు పర్యటన రద్దు

ప్రజాశక్తి -పాడేరు : ఈనెల 10న అరకు వ్యాలీలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పర్యటన అనివార్య కారణాలతో రద్దయిందని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ గురువారం ప్రకటనలో తెలిపారు.

9న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పర్యటన

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్‌రెడ్డి ఈనెల 9న పాడేరులో పర్యటిస్తారని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి. వి. అభిషేక్ గురువారం తెలిపారు. అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లా అధికారులతో ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలుపై ఐటిడిఎ సమావేశ మందిరంలో సమీక్షిస్తారని తెలిపారు.

తవ్వి వదిలేసిన రోడ్డుకు మోక్షం కలిగించండి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని పెద్దమట్టపల్లి, కుందులూరు మీదుగా నరసింగపేట వెళ్లే ప్రధాన రోడ్డును తవ్వి వదిలేశారని, దానికి ఎప్పుడు మోక్షం కల్గిస్తారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ ప్రశ్నించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చినబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల క్రితం ఆర్భాటంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు ఈ రోడ్డుకు శంకుస్థాపన చేసి ఇంతవరకు పనులు మొదలు పెట్టలేదని తెలిపారు. శంకుస్థాపనలే తప్ప పనులు చేయరా? అని ప్రశ్నించారు. రోడ్డు మొత్తం తవ్వి వదిలేసిన కారణంగా అటువైపుగా ప్రయాణికులే కాక 108, 104 వాహనాలు, కనీసం ఆటోలు కూడా తిరగలేని పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. కుందులూరు, టేకులూరు, గుల్లేటివాడ, ముల్కనపల్లి, కుంజువారిగూడెం, తెల్లంవారి గూడెం గ్రామాలకు మండల కేంద్రం 20 కిలోమీటర్ల దూరంలో ఉందని, ఆయా గ్రామాల ప్రజలు తహశీల్దారు కార్యాలయానికి, బ్యాంకులకు, నిత్యావసర సరుకుల కోసం, ఆసుపత్రులకు రావాలంటే ఏ వాహనాలు కూడా అటువైపు తిరగట్లేదని తెలిపారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి గిరిజనులు, వారి గ్రామాలంటే ఇంత నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. గిరిజన గ్రామాల పట్ల చిత్తశుద్ధి లేదని, గడపగడపకు వెళ్లి గొప్పలు చెప్పుకుంటున్నారు తప్ప గ్రామాల్లో ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి చిత్తశుద్ధి ఉంటే తవ్వి వదిలేసిన రోడ్డును తక్షణమే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల నాయకులు వడ్లాది రమేష్, గుండుపూడి లక్ష్మణరావు, పంకు సత్తిబాబు, సోడి మల్లయ్య, ప్రకాష్, శీరపు తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 2 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి-రంపచోడవరం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్" అక్టోబర్ రెండవ తేదీ నుండి గ్రామ/వార్డు సచివాలయాల స్థాయిలో ప్రారంభం కానున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి కంగల పోతురాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన 15 సంవత్సరాల నిండిన స్త్రీ, పురుషులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ తదితర ఐదు క్రీడల్లో గ్రామం/వార్డు, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర తదితర ఐదు స్థాయిల్లో 50 రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రామ/వార్డు సచివాలయ స్థాయిలో ఆయా క్రీడలలో కనీసం రెండు జట్లు పాల్గొనాల్సి ఉంటుందని, ఆటగాళ్లు సచివాలయాల్లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఆట ఆడడానికి ముందు రిజిస్ట్రేషన్ కాపీ, ఆధార్ నకలు అంపైర్, రెఫరీలకు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ క్రీడల్లో ఉద్యోగులెవరూ పాల్గొనరాదన్నారు. క్రీడాకారులకు భోజన వసతి, రవాణా సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ఈ టోర్నమెంట్లు విజయవంతానికి జిల్లా కలెక్టర్లు నేతృత్వంలో మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి అధికారులు, ఉద్యోగులతో వివిధ కమిటీలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని, పాఠశాల, కళాశాల విద్యార్థులు కూడా ఈ క్రీడల్లో పాల్గొనవచ్చని తెలిపారు. పోటీల్లో పాల్గొను క్రీడాకారులు వాలీబాల్‌కు 12 మంది, కబడ్డీకి 12 మంది, ఖోఖోకు 15 మంది, క్రికెట్‌కు 16 మంది, షటిల్ బ్యాడ్మింటన్‌కు ఇద్దరు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. సచివాలయ స్థాయిలో 12 రోజులు, మండల స్థాయిలో 12 రోజులు, నియోజకవర్గం స్థాయిలో 9 రోజులు ఈ క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సచివాలయ, మండల స్థాయిల్లో ఎటువంటి నగదు బహుమతులు లేవని, విజేతలకు సర్టిఫికెట్లు, షీల్డ్‌లు బహుకరించడం జరుగుతుందని వెల్లడించారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.30వేలు, తృతీయ బహుమతి రూ.20వేలు, రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి రూ.5లక్షలు, ద్వితీయ బహుమతి రూ.3 లక్షలు, తృతీయ బహుమతి రూ.2 లక్షలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

రహదారికి అడ్డంగా కూలిన చెట్టు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఎర్రదిబ్బల వద్ద ప్రధాన రహదారికి అడ్డంగా చెట్టు కూలిపోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గత మూడు రోజుల నుంచి మన్యంలో విస్తీరంగా వర్షాలు కురుస్తుండడంతో రహదారి సమీపంలో ఉన్న చెట్టు వేళ్లతో గురువారం కూలిపోయి రహదారి అడ్డంగా పడిపోయింది. దీంతో కొన్ని గంటలు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనంతరం వాహనచోదకులు సమీప గ్రామంలో ఉన్న గిరిజనులను రప్పించి చెట్టుని తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం

రబ్బరు రైతులతో మాట్లాడుతున్న రావత్, ఇతర అధికారులు

గిరిజనులకు మెరుగైన సేవలు

రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రావత్

ప్రజాశక్తి మారేడుమిల్లి

ఏజెన్సీలోని గ్రామ సచివాలయాల ద్వారా గిరిజనులకు సకాలంలో మెరుగైన సేవలు అందించాలని సంబంధిత అధికారులను రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ ఆదేశించారు. మారేడుమిల్లి మండలంలో వివిధ గ్రామాలలో గురువారం ఆయన ఆర్థిక శాఖ ఆర్ఎం అండ్ ఎఫ్‌పిసిటి ఎన్.గుల్జార్, రాష్ట్ర ఫైనాన్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.సునీల్ కుమార్ రెడ్డి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే, డిఎఫ్ఒ జిజి.నరేంద్ర, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ముందుగా మండలంలోని సున్నంపాడు గ్రామ సచివాలయాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పంచాయతీ పరిధిలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి, ఎంతమంది జనాభా ఉన్నది ఆరా తీశారు. అనంతరం మారేడుమిల్లి గ్రామంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఏయే ఆహార పదార్థాలు పెడుతున్నారో, పాధ్యాయులు ఏ విధంగా పాఠాలు చెబుతున్నారో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరువాత పూజారిపాకలు గ్రామంలో రబ్బర్ ప్లాంట్‌ను పరిశీలించారు. గ్రామంలో ఎంతమంది రబ్బర్ రైతులు ఉన్నది, ఎన్ని ఎకరాలలో రబ్బర్ ప్లాంటేషన్లు చేస్తున్నదీ, ఎకరానికి ఎంత ఆదాయం వస్తున్నదీ రైతులను అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీలోని రబ్బరు అభివృద్ధికి ఏవేవీ కావాలో, రబ్బర్ సాగుకు ఏమైనా సమస్యలు ఉన్నాయా? అనే విషయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆర్టికల్చర్ అధికారి కె.చిట్టిబాబు, ఎంపీడీవో జయంతి, డిప్యూటీ తహశీల్దారు బాలాజీ, రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రంపచోడవరం : అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేసే బాధ్యత సంబంధిత శాఖల అధికారులపై ఉందని రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ ఆదేశించారు. గురువారం సాయంకాలం స్థానిక ఐటీడీఏ సమావేశపుహాల్లో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పాఠశాలలు, రోడ్లు, నెట్‌వర్క్ సౌకర్యం, కరెంటు, తాగునీరు, గ్రామ సచివాలయాల అభివృద్ధి తదితర వాటిపై శాఖల వారీగా సమీక్షించారు. కార్యక్రమంలో ఆర్థిక శాఖ ఆర్‌యం అండ్ యఫ్‌పిసిటీఎన్ కార్యదర్శి ఎన్.గుల్జార్, ఆర్థిక శాఖ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.సునీల్ కుమార్ రెడ్డి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సర్, డీఎఫ్ఒ జిజి. నరేంద్రన్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్, డిఎల్‌పిఒ రాఘవన్, జిసిసి డిఎం పార్వతీశ్వరరావు, ఎడిఎంహెచ్ఒ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చంద్రం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

టివిఆర్.చంద్రం చిరస్మరణీయుడు

ప్రజాశక్తి- కూనవరం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని భద్రాచలం డివిజన్లో సిపిఎం మొదటి తరం నాయకుడు టివిఆర్.చంద్రం చిరస్మరణీయుడని సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు అన్నారు. చంద్రం వర్ధంతి సందర్భంగా స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పార్టీ సీనియర్ సభ్యులు గడ్డిపాటి షణ్ముఖరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ నిజాయితీకి, నిబద్ధతకు మారుపేరుగా నిలిచిన చంద్రం అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. చంద్రం ఆశయ బాటలో పయనిస్తూ, ఆయన స్ఫూర్తితో పోలవరం ముంపు మండలాల ప్రజలను ముంచడానికి ప్రయత్నిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరంతర పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు, పంపు సత్యనారాయణ, కొండా ఈశ్వర్లు, టేకుల బోరు శాఖ కార్యదర్శి వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు పాడేరు ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి -కొయ్యూరు : కొయ్యూరు మండలంలో ఈ నెల 8న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పర్యటిస్తారని వైసిపి మండల అధ్యక్షులు జల్లి బాబులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మర్రివాడ పంచాయతీ పరిధి నిమ్మలగొంది గ్రామంలో నూతన రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు.

రైతులకు జీడిమామిడి మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి-రంపచోడవరం

వరాహ ఆగ్రో ఫారెస్ట్ ద్వారా రైతులకు ఉచితంగా జీడి మామిడి మొక్కలను రంపచోడవరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గురువారం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీడిమామిడి మొక్కల ద్వారా మంచి ఆదాయం వస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వరాహ స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎంఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ రంపచోడవరం మండలంలోని వేములకొండ, హైపోలవరం, దారగూడెం, సీమ గండి గ్రామాల గిరిజనులకు సుమారు మూడు వేల జీడి మామిడి అంట్లు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్బన్ క్రెడిట్స్ ద్వారా రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. మొక్కలు కార్బన్ వినియోగాన్ని లెక్కించడం ద్వారా రైతులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వరాహ టీం లీడర్ కే శివకుమార్, భువనకృష్ణ, అరవింద్, అప్పన్న పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పంచ గ్రామాల భూసమస్యపై ర్యాలీ

ప్రజాశక్తి-సింహాచలం : పంచ గ్రామాల భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సమైక్య ప్రజా, రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యాన గురువారం సింహాచలం తొలి పావంచా నుంచి గోపాలపట్నం పెట్రోల్ బంక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, పంచ గ్రామాల భూ సమస్యను పరిష్కరిస్తామని చెప్పి అధికారాన్ని చేపడుతున్న ప్రభుత్వాలు తర్వాత కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని విమర్శించారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని చెప్పి గద్దెనెక్కిన వైసిపి ప్రభుత్వం నాలుగేళ్లలో చేసిందేమీ లేదన్నారు. సమస్య ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉందని ఎద్దేవాచేశారు. కనీసం మరమ్మతులకు గురైన ఇళ్లను బాగుచేసుకునేందుకు కూడా అనుమతి ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మరమ్మతులు కోసం పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే జిల్లా అధికారులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు స్పందిస్తూ ఇళ్ల మరమ్మతులు చేసుకోవచ్చని తెలిపారని, కానీ ఆచరణలో మాత్రం దేవస్థానం అధికారులు అడ్డుకుంటున్నారని వివరించారు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఇళ్లకు మరమ్మతులు చేసుకోకపోతే గోడలు పడిపోయే పరిస్థితి ఉందన్నారు. బి.రమణి అధ్యక్షతన జరిగిన ఈ ర్యాలీలో నాయకులు టివి.కృష్ణంరాజు, సిహెచ్ఎస్ గోపాలకృష్ణ, విబిఎన్ ప్రసాద్, బి.అరుణ్ కుమార్, హెచ్.కోటేశ్వరరావు, ఎస్.రాజు, ఎస్వి.రమణ, వి.నారాయణరావు, కృష్ణారావు, బి.శంకరరావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, తదితరులతో పాటు వివిధ కాలనీలకు చెందిన బాధితులు పాల్గొన్నారు.

30 మంది రక్తదానం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం రామవరం గ్రామంలో నమ్మి జగదీష్ మొదటి వర్ధంతి సందర్భంగా న్యూ ట్రెండింగ్ యూత్ ఆధ్వర్యాన చత్రపతి శివాజీ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 30 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ శిబిరంలో వైసిపి నాయకులు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, ఎంపిటిసి గొలగాని కృష్ణ, సర్పంచ్ వై.పైడిరాజు, గ్రామ పెద్దలు, యువకులు, రక్తదానం చైతన్యకర్త వి.వినోద్‌బాలు, చత్రపతి శివాజీ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, న్యూ ట్రెండింగ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు

భవిష్యత్ గ్యారెంటీ పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - చీడికాడ : టిడిపి మినీ మేనిఫెస్టోపై విస్తృత ప్రచారం చేయాలని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కొత్తపల్లిలో బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ పోస్టర్లను ఆవిష్కరించారు. టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేసే తల్లికి వందనం, మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లు, మహిళలకు ఉచిత ప్రయాణం, 18ఏళ్లు నిండిన మహిళలకు ఆర్థికసాయం వంటి పథకాలపై ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పోతల చిన్నం నాయుడు, కార్యదర్శి బొబ్బాది తాతారావు, సర్పంచ్ సూరినాయుడు, ఎంపిటిసిలు బీల కోటి, పైల ముత్యలనాయుడు, మాజీ సర్పంచ్‌లు పంచాడ దాలినాయుడు, అప్పారావు, కొల్లి పైడం నాయుడు, వైస్ సర్పంచ్‌లు, ధర్మయ్య,నాయుడు, గ్రామ అధ్యక్షులు గణేష్, శివ, చిన అప్పారావు, శ్రీరామ్మూర్తి, రాజు, చిన్నం నాయుడు, దేముడు నాయుడు, పాత్రిని సురేష్, చెల్లయ్య, కోటి, వెంకటరావు, పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న ఇళ్ల నిర్మాణాలు

ప్రజాశక్తి -కోటవురట్ల : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు 85శాతం పురోగతిలో ఉన్నట్లు గృహ నిర్మాణ శాఖ డిఇఇ విజయుడు తెలిపారు. నియోజకవర్గంలో 13,039 ఇళ్లు మంజూరుకాగా, 2667 పూర్తయ్యాయన్నారు మండలాల వారీగా ఎస్.రాయవరంలో 800, నక్కపల్లిలో 619, కోటవురట్లలో 416, పాయకరావుపేటలో 769 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. ,ప్రస్తుతం పునాదుల స్థాయిలో 2513, రూఫ్ లెవెల్ 829, శ్లాబ్ లెవల్ 200 ఉన్నాయని, వాటిని డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. లబ్ధిదారులకు ఇసుక సిమెంట్ ఐరన్ అందిస్తూ, నిర్మాణాల వద్ద ఎటువంటి అసౌకర్యం కలగకుండా వసతులు కల్పిస్తున్నామన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

సమావేశం మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

ప్రజాశక్తి -హుకుంపేట: చిరుధాన్యాలతో రక్తహీనత నివారణతో పాటు సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునిఅరకు ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ అన్నారు. గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని సూచించారు. గురువారం పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ సిహెచ్ బాలామణిదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన చిరుధాన్యాలతో తయారుచేసిన వంటకాలు, చిరుధాన్యాల ప్రాముఖ్యతను తెలియజేసే స్టాల్స్‌ను పరిశీలించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఫాల్గుణ మాట్లాడుతూ, చిరుధాన్యాలతో రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక రోగాలు దరిచేరవన్నారు. వ్యాధి పీడితులు వీటిని ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని నియంత్రణలో ఉంచొచ్చన్నారు. బయట దుకాణాల్లో దొరికే తినుబండారాల కంటే చిరుధాన్యాలతో తయారుచేసిన పదార్థాలను పిల్లలకు పెట్టాలని సూచించారు. అనుబంధాహారాన్ని పిల్లలకు పెట్టాలనిన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కూడా రాజబాబు, ఎంపిడిఒ ఆర్ వెంకటరావు, జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగం, వైద్యాధికారి గాయత్రి. సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి జిల్లాలో 7.28 లక్షల మంది ఓటర్లు

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలో 7 లక్షల 28 వేల 513 మంది ఓటర్లు ఉన్నారని జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్ తెలిపారు.. గురువారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అరకు వ్యాలీలో 2 లక్షల 20 వేల 580 మంది, పాడేరులో 2 లక్ష 30 వేల 90 ఓటర్లు, రంపచోడవరంలో 2లక్షల 68 వేల 843 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో 7 లక్షల 6వేల 267 మంది ఓటర్లను పరిశీలించామని, 97 శాతం పూర్తి చేసామన్నారు. జీరో ఇంటినెంబర్లు ఉన్న గృహాలు 10,151 ఉన్నాయన్నారు. వాటికి ఇంటి నెంబర్లను కేటాయిస్తామన్నారు. మృతి చెందిన ఓటర్లు 3949 మంది, రెండు చోట్ల ఓటర్లుగా నమోదైన వారు 4850 మంది, నకిలీ ఓటర్లు 48మంది, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు 707 మంది ఉన్నారన్నారు. డోరు నెంబర్లలో అందుబాటులో లేని ఓటర్లు 576 మంది ఉన్నారన్నారు. వివిధ రాజకీయ పార్టీలు సూచనల మేరకు 68 మంది ఓటర్లలో 40 మందిని పున:పరిశీలించామని, మరో 28 మంది ఓటర్లను పరిశీలించాల్సి ఉందన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు డిఆర్ఓ అంబేద్కర్

గీతంలో ఓపెన్ స్కూల్

ప్రజాశక్తి-మధురవాడ : సైన్స్ కోర్సుల పట్ల విద్యార్థులలో ఆసక్తిని పెంచడంతో పాటు పదో తరగతి, ఇంటర్మీడియట్ తరువాత గల విద్యావకాశాలు, పరిశోధకులుగా మారాలంటే చేయాల్సిన కృషి, ఆసక్తి కలిగించే విజ్ఞాన శాస్త్ర వింతలను తెలియచెబుతూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సామాజిక బాధ్యతగా ఓపెన్ స్కూల్ పేరిట సరికొత్త కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టింది. దీనికి నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల నుంచి అనుహ్య స్పందన లభించింది. దాదాపు 1000 మంది విద్యార్థులు మొదటిరోజు గీతం విశ్వవిద్యాలయాన్ని సందర్శించి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ దేశంలో శాస్త్ర విజ్ఞాన పరిశోధనలు పెరుగుతున్నాయని, చంద్రయాన్‌వంటి ప్రయోగాలు విజయవంతం కావడం వెనక శాస్త్రవేత్తల కృషి ఉందని తెలిపారు. విద్యార్థి దశలోనే విజ్ఞాన శాస్త్రం పట్ల అవగాహన, అభిరుచి పెంచుకోవడం ద్వారా దేశ ప్రగతిలో యువత భాగస్వామ్యులు కావచ్చన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కృష్ణ మాట్లాడుతూ, విద్యార్థి దశలో ప్రతి సబ్జెక్టునూ ఆసక్తితో చదవడం ద్వారా భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలన్నారు. గణితశాస్త్రం, భౌతిక రసాయన శాస్త్రాలు, జీవశాస్త్ర పరిశోధనలు మానవ మనుగడకు మూలం అని తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వేదవతి మాట్లాడుతూ, ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి వృత్తివిద్యలే కాక సైన్స్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించే ఎన్నో కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా అందిస్తున్న వివిధ సైన్స్ సంబంధ డిగ్రీ, పీజీ కోర్సుల వివరాలను వెల్లడించారు. వివిధ సైన్స్ విభాగాల సీనియర్ ప్రొఫెసర్లు హాజరై విద్యార్థులకు ఆసక్తి కలిగించే సైన్స్ పరిశోధనలను వివరించారు.
ఓపెన్ స్కూల్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను వివిధ సైన్స్ విభాగాలు, పరిశోధన కేంద్రాలను పరిశీలించే అవకాశం కల్పించారు. ఓపెన్ స్కూల్ కార్యక్రమం ద్వారా సైన్స్‌తో పాటు మేనేజ్‌మెంట్, లా, ఆర్కిటెక్చర్, ఫార్మశీ, ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ విభాగాలను సహితం విద్యార్థుల సందర్శనకు అనుమతిస్తున్నట్లు గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - ఆరిలోవ : బిఆర్‌టిఎస్ రోడ్డులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ సమీపంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వెనుక కూర్చున్న మరో యువకునికి గాయాలయ్యాయి. ఆరిలోవ పోలీసుల కథనం ప్రకారం... ఆరిలోవ ప్రాంతానికి చెందిన పడాల శివప్రసాద్ అలియాస్ సిద్ధు(22), బోయపాలెం ప్రాంతానికి చెందిన గెదల మణికంఠ(17) పెందుర్తిలో వివాహ కార్యక్రమానికి బుధవారం హాజరయ్యారు. వివాహం అనంతరం బుధవారం అర్ధరాత్రి అడివివరం నుంచి హనుమంతువాక వైపు తిరిగి బైక్‌పై వస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కూడలి సమీపంలో ఆరిలోవ వైపు మలుపు తిరుగుతున్న లారీని బైక్ బలంగా ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న శివప్రసాద్ తలకు బలంగా గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న గెదల మణికంఠకు తీవ్ర గాయాలు కావడంతో కెజిహెచ్‌కు తరలించారు. ఆరిలోవ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రాథమిక వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

25 కిలోల గంజాయితో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని ఎంకె.పట్నం శివారులో 25 కిలోల గంజాయితో ముగ్గురు వ్యక్తులను పట్టుకుని అరెస్టు చేసినట్లు రోలుగుంట ఎస్ఐ నాగ కార్తీక్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఎంకె.పట్నం శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, గంజాయితో ఎంకే.పట్నం గ్రామానికి చెందిన సారమండ నూకరాజు, రావణపల్లికి చెందిన ముంజేటి ఈశ్వరరావు, ఎస్.రామోజీలను పట్టుకున్నామన్నారు. నిందితుల నుంచి 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

వృద్ధుడు అదృశ్యం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బయటకు వెళ్లిన వృద్ధుడు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎవిఎన్ కాలేజీ దరి రెల్లివీధికి చెందిన కోన ఆదినారాయణ (73) జూలై 15న ఉదయం 6.30 గంటలకు ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఆయన కోసం పలు చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో బాధిత కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారు. ఆదినారాయణ ఐదు అడుగుల ఎత్తు, నలుపు రంగులో ఉంటాడని, ఇంటి నుంచి వెళ్లేటప్పుడు నీలం రంగు చొక్కా, ఆరెంజ్ రంగు టవల్ కట్టుకుని ఉన్నాడని కుటుంబీకులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వాళ్లు 9247743831, 7386880196, 9440796019 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

సమస్యలు పరిష్కరించాలి : గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : పశ్చిమ నియోజకవర్గంలోని గెడ్డలు, కాలువల సమస్యలు పరిష్కరించాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మను ఎమ్మెల్యే గణబాబు కోరారు. ఈ మేరకు జివిఎంసిలోని కమిషనర్ ఛాంబర్‌లో కమిషనర్‌ను ఎమ్మెల్యే బుధవారం కలిసి సమస్యలపై మాట్లాడారు. హెచ్‌పిసిఎల్ విస్తరణ సమయంలో జరిగిన పబ్లిక్ హియరింగ్‌లో సంస్థ అంగీకరించిన రెండు డ్రెయిన్ల నిర్మాణాలను పూర్తిచేయించాలని కోరారు. మొదటిది మల్కాపురం డ్రెయిన్ పూర్తి చేశారని తెలిపారు. రెండవది శ్రీహరిపురం డ్రెయిన్ ఎంఐజి కాలనీ మీదుగా ఎక్స్ సర్వీస్ మెన్ కాలనీ, కోరమండల్ సంస్థ, గుల్లలపాలెం మీదుగా సముద్రంలోకి నీరు కలిసే గెడ్డను పూర్తిచేయించాలని కోరారు. శ్రీహరిపురం డ్రెయిన్‌కు సంబంధించి గతంలో డిపిఆర్ తయారయ్యిందని, హెచ్‌పిసిఎల్ సంస్థ నుంచి నిధులు మంజూరు చేయించుకొని పనులు పూర్తిచేయాలని కోరారు.
ఎన్ఎడి తారకరామ అపార్ట్‌మెంట్ వెనుక నుంచి కరాస, మర్రిపాలెం, శ్యామ్‌నగర్ కాలనీ మీదుగా కంచరపాలెం చాకలిగెడ్డ వరకు నిలిచి ఉన్న నీరును పారే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వేదాద్రిపేట కాలనీ, అశోక పార్క్ సమీపంలోని కాలువలో నిలిచిపోయిన చెత్తను తొలగించాలని విజ్ఞప్తిచేశారు.

డెలివరీలకు ఆపరేషన్ థియేటర్ ఛార్జీ రాయితీ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : తన తండ్రి పుల్లేటికుర్తి నారాయణమూర్తి 68వ జయంతి సందర్భంగా ఆపరేషన్ థియేటర్ ఛార్జీ లేకుండా, తమ ఆసుపత్రిలో గర్భిణులకు డెలివరీ చేసే అవకాశాన్ని కల్పిస్తున్నామని పట్టణంలోని ఐదు రోడ్ల జంక్షన్‌లోని ఉమానారాయణ తల్లీపిల్లల ఆసుపత్రి డాక్టర్ మల్లికార్జునరావు తెలిపారు.

ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి తదితరులు

పలుచోట్ల టిడిపి 'భవిష్యత్తు గ్యారెంటీ' ప్రచారం

ప్రకాశక్తి-రాజవొమ్మంగి
తెలుగుదేశం ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి అన్నారు. మండలంలోని లబ్బర్తి, కింద్ర, గడుఓకుర్తి పంచాయితీలలో గురువారం చంద్రన్న షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యాన నిర్వహించారు. ఇందులో పాల్గొన్న రాజేశ్వరి టిడిపి మేనిఫెస్టోలో ఉన్న అంశాలను ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించారు. రూ.200 పెన్షన్‌ను రూ.2000 చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఆడపడుచులకు పసుపు కుంకుమ ద్వారా రూ.10వేలు ఇచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దంతులూరి శివరామరాజు, ముప్పన కేశవ్, మఠం విజయ భాస్కర్, ముప్పన సావిత్రి, జెట్టి మధు, సురేష్, తేజ, సత్యనారాయణ పాల్గొన్నారు.

రంపచోడవరం : మండలంలోని బందపల్లి పంచాయితీ తాళ్లపాలెం గ్రామంలో చంద్రబాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టిడిపి మండల అధ్యక్షుడు కారం సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి పెంటపాటి మోహన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టోలోని అంశాలను తెలియజేశారు. ఇందులో పాల్గొన్న తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గొర్లె సునీత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కారం సింహాచలం, మడకం పండు దొర, పారా వెంకన్న బాబు, కంగల రామకృష్ణ దొర, ముర్ల వెంకన్న, ముర్ల బుల్లయ్య, గుర్రాల అర్జునరావు పాల్గొన్నారు.

ఆకలితో అలమటించిన గిరిజనులు

ప్రజాశక్తి-విఆర్.పురం : పింఛన్ల పంపిణీ నిమిత్తం రేఖపల్లి ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు ఆధ్వర్యంలో జరిగిన సభకు వచ్చిన అమాయక గిరిజనులు అన్నం లేక ఆకలితో అలమటించారని టిడిపి జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి, జీడిగుప్ప ఎంపిటీసీ వాళ్ళ వెంకటేశ్వర రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి తప్పని సరిగా రావాలని హుకుం జారీ చేయడంతో కొండలు, గుట్టల నుండి సుమారు 25 కిలోమీటర్ల మేరకు నాటు పడవలపై ఉప్పొంగుతున్న గోదావరి నదిలో ప్రయాణించి వందల సంఖ్యలో అమాయక గిరిజనులు వచ్చారని తెలిపారు.
ఉదయం ఆరు గంటలకు ఏమి తినకుండా వచ్చిన నిర్వాసిత ప్రజలకు ఉదయం టిఫిన్, మధ్యాహం భోజనం పెట్టలేదని, దీంతో గిరిజనులు, ప్రధానంగా చిన్న పిల్లలతో ఉన్న తల్లులు, ముసలి వాళ్లు, రోగులు ఎంతగానో ఇబ్బంది పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు మాత్రం కడుపు నిండా తిని సభకు వచ్చారని పేర్కొన్నారు. గిరిజనులు ఒక్కొక్కరూ రూ.400 ఖర్చు చేసుకోవాలని వచ్చారని, ఆ డబ్బులు ఎవరిస్తారని ప్రశ్నించారు. పింఛను వారి పంచాయతీలోనే ఇస్తే గిరిజనులకు ఇన్ని ఇబ్బందులు ఉండేవి కావని పేర్కొన్నారు.

డబ్ల్యుడి బ్లూ ఎస్ఎన్ 580 ఎన్‌విఎంఇ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విజువల్ బ్రిలియెన్స్, డిజిటల్ కంటెంట్ క్రియేషన్‌కు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోందని, అందుకు తగ్గట్టు సృజనాత్మక నిపుణుల కోసం వెస్టన్ డిజిటల్ డబ్ల్యుడి బ్లూ ఎస్ఎన్ 580 ఎన్‌విఎంఇ ఎస్ఎస్‌డిని పరిచయం చేస్తున్నట్లు వెస్టన్ డిజిటల్ సీనియర్ డైరెక్టర్ సేల్స్ ఖలీద్ వానీ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దీని స్లిమ్ ఎం 2, ఫారమ్ ఫ్యాక్టర్ 2 టిబి వరకు కంటెంట్‌ను కలిగి ఉంటుందన్నారు. ఐదు సంవత్సరాల వారంటీ ఉంటుందని తెలిపారు.

చెంత చేరని 'చేయూత'

అధికారులు స్పందించి అందించాలని వేడుకోలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి
అల్లూరి సీతారామరాజు జిల్లా, వై రామవరం మండలం, పాతకోట గ్రామ సచివాలయంలో 45 సంవత్సరాలు దాటిన మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం పలు కారణాల చేత అందడం లేదు. పంచాయితీలోని 45 సంవత్సరాలు దాటిన మహిళలకు సచివాలయ సిబ్బంది తగు ధ్రువపత్రాలు లేవని మొదట పలుమార్లు తిప్పారు. తరువాత అవసరమైన పత్రాలు తీసుకుని వెళ్లగా మీరు ఉద్యోగస్తులని, అర్హులు కాదని చివరి రోజు చెప్పారు. ఆశా కార్యకర్తలు తాము పర్మినెంట్ ఉద్యోగులం కాదని, తమకు రూ.4,500 నుండి రూ.6,500 వరకు మాత్రమే జీతాలు వస్తున్నాయని, నెలసరి ఆదాయం రూ.10వేలు లోపు ఉన్న వాళ్లు అర్హులుగా ప్రభుత్వ నిబంధన ఉన్నా సచివాలయ సిబ్బంది తమ దరఖాస్తులను తిరస్కరించటం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పథకం తేదీ పెంచారని తెలిసి, పాతకోట డిజిటల్ అసిస్టెంట్ విజయ్‌కు ఫోన్ చేస్తే రాంగ్ నెంబర్ అని కట్ చేశారని, ఇది మొదటి సారి కాదని, పలుమార్లు ఇలా ప్రజల పట్ల నిర్లక్ష్యంగా ఆయన సమాధానం చెప్పడం జరుగుతుందని పేర్కొన్నారు. సంబంధిత ప్రభుత్వ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పాతకోట పంచాయతీ మహిళలు గడుతూరి వరమని, దుమంతి విమలకుమారి, గొర్లే జ్ఞానబాయి, రావడి కమలమ్మ, గుత్తం లక్ష్మి, సుంకరి కాసులమ్మ, డ్వాక్రా మహిళలు, మినీ అంగన్వాడీ టీచర్లు విజ్ఞప్తి చేశారు.

తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్న గిరిజన మహిళలు

విద్యుత్ కోతలతో రైతుకు తిప్పలు

దమ్ముకు నీరులేక గడ్డితో ఉన్న వంగా అప్పారావు పొలం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి
ఎడాపెడా విద్యుత్ కోతలతో జిల్లాలో రైతన్నలకు అవస్థలు తప్పడం లేదు. గృహ, వ్యవసాయ వినియోగదారులకు అంతరాయం లేకుండా మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు పరిశ్రమల రోజువారీ విద్యుత్ వినియోగంలో కొన్ని నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు ఈ నెల 3న ఎపిఇపిడిసిఎల్ అధికారులు మీడియాకు ప్రకటన విడుదల చేసినా అంతకు చాలా రోజుల ముందు నుంచే రైతును విద్యుత్ సరఫరా కష్టాలు వెంటాడుతున్నాయి. వ్యవసాయ పంపుసెట్లకు 9 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా లేక బోర్ల కింద సాగుచేస్తున్న రైతు తిప్పలు పడుతున్నాడు. విద్యుత్ సరఫరా సమస్య తరచూ వుండడంతో బోర్ల కింద వరి పంట సాగుచేయలేని పరిస్థితి నెలకొంది.
జిల్లాలోని 24 మండలాల్లో 41 వేలకు పైగా వ్యవసాయ బోర్లున్నాయి. జిల్లాలోని వరి సాధారణ సాగు విస్తీర్ణం 1.36 లక్షల ఎకరాల్లో 50 వేల ఎకరాల వరకు బోర్లు కింద సాగవుతున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులకు తోడు 9 గంటల నిరంతర విద్యుత్ సరఫరా లేకపోవడంతో బోర్లు కింద వరి సాగు రైతుకు కష్టంగా మారింది. తిమ్మరాజుపేట, మునగపాక, పెదపాడు, ఖాజీపాలెం తదితర ప్రాంతాల్లో బోర్ల కింద కొంతమంది రైతులు ఉడుపులు చేసుకోలేకపోగా, ఉడుపులైన పొలాలకు కరెంట్ కోతలతో మడుల నిండా నీరు పెట్టలేని పరిస్థితి నెలకొంది. వర్షాధార భూముల వలె బోర్ల కింద వరి పొలాలు ఎండిపోతున్నాయి. అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటకు చెందిన కౌలు రైతు శరగడం రాము చింతచెట్లుదిబ్బ దరిలోని 70 సెంట్లులో బోరు కింద వరి పంట వేశాడు. విద్యుత్ సరఫరా మధ్యమధ్యలో నిలిచిపోవడంతో నీటితడి పెట్టలేని కారణంగా పంట ఇప్పుడు ఎండిపోతోంది. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఇస్తున్న విద్యుత్‌లో రెండు నుంచి నాలుగు సార్లు సరఫరా ఆగిపోవడంతో తడులు పెట్టలేకపోతున్నామని రైతులు 'ప్రజాశక్తి' వద్ద వాపోయారు. చింతచెట్లుదిబ్బదరిలోని రాము వరి పొలానికి పైభాగాన 40 సెంట్లు భూమిని వంగా అప్పారావు కౌలుకు తీసుకున్నాడు. బోరు నీరు కట్టుకొనే వరకు విద్యుత్ వుండకపోవడంతో దమ్ము చేయలేకపోయాడు. ఆకు ముదిరిపోయింది. విద్యుత్ సరఫరాలో వున్న ఇబ్బందులతో బోర్ల కింద వరి సాగు దాదాపు అన్ని ప్రాంతాల్లో ఇలాగేవుంది.

బోర్ల కింద ఉడుపులు కాని దుస్థితి ఎండిపోతున్న వరి మడులు

9 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

వ్యవసాయ పంపుసెట్లకు 9 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి. అనధికార కోతలు నివారించాలి. కరెంట్ సరఫరాలో కోతలతో బోర్ల కింద ఉడుపులు కాలేదు. అనేక ప్రాంతాల్లో ఉడిసిన పొలాలు ఎండిపోతున్నాయి. వాస్తవ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని సాంకేతిక సమస్యల్లేకుండా 9 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి.

కర్రి అప్పారావు,
ఎపి రైతు సంఘం అధ్యక్షులు, అనకాపల్లి జిల్లా

ద్వారబంధాల చంద్రయ్య జయంతిని అధికారికంగా జరపాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి
రంప పితూరీకి ఆద్యుడు, తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు ద్వారబంధాల రామచంద్రయ్య జయంతిని సెప్టెంబర్ 10వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రమంతా అధికారికంగా జరపాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పోరాటానికి 50 సంవత్సరాలు ముందే ఏజెన్సీలో గిరిజనుల కోసం, అణగారిన పేద వర్గాల కోసం బ్రిటీష్ సామ్రాజవాదులపై, జమీందారీ వ్యవస్థపై ద్వారబంధాల చంద్రయ్య పోరాటం చేశాడని గుర్తు చేశారు. 1922లో అల్లూరి దాడి చేసిన అడ్డతీగల పోలీస్ స్టేషన్‌పై 1979లోనే చంద్రయ్య దాడి చేశాడని గుర్తు చేశారు. రంప పితూరీగా 1874 నుండి 1880 వరకు సాగిన ఈయన పోరాటం అప్పట్లో నాలుగైదు జిల్లాల్లో సాగిందన్నారు. ఆయన అల్లూరి సీతారామరాజు పోరాడిన రంపచోడవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, కొయ్యూరు, మంప, పాడేరు, గొలుగొండ ప్రాంతాలతోపాటు భద్రాచలం, చింతూరు, కూనవరం, రేకపల్లి, విఆర్ పురం, కిర్లంపూడి తదితర ప్రాంతాల్లో సాయుధ పోరాటాలు సాగించారని తెలిపారు. చంద్రయ్య కర్ర సాము, కత్తి పోరాటాల్లో, తుపాకీ కాల్పుల్లో, గుర్రపు స్వారీలో ఆరితేరిన యోధుడని, చంద్రయ్యనే స్ఫూర్తిగా తీసుకొని అల్లూరి సీతారామరాజు కూడా పోరాటాలు సాగించారని తెలిపారు. ఈ నేపథ్యంలో చంద్రయ్య జయంతిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రమంతా అధికారికంగా జరపాలని డిమాండ్ చేశారు. రాజవొమ్మంగి మండలం శరభవరంలో చంద్రయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల పడాల హర్షం వ్యక్తం చేశారు.

కైలాసగిరిపై సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కైలాసగిరిపై సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు తాను కృషి చేస్తానని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. గురువారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల సారథుల సంయుక్త సౌజన్యంతో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మేయర్ మాట్లాడుతూ గురువులు ఎప్పుడూ పూజనీయులేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యతనిస్తోందన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను ఆమె సత్కరించారు.

రాష్ట్ర వ్యాప్తంగా యువజన నాయకత్వ శిబిరాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా యువజన నాయకత్వ శిబిరాలు ఏర్పాటు చేస్తామని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు అన్నారు. కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర మొదలుపెట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు నెలలపాటు నాయకత్వ శిక్షణ శిబిరాలు నిర్వహించి పలు రకాల పోటీలు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. యువత ఐక్యతకు దోహదం చేసేలా ఈ కార్యకలాపాలు ఉంటాయని తెలిపారు. బిజెపి ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఇచ్చి యువతను ఎలా మోసం చేసిందో వివరించారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ సర్కారు నిర్వీర్యం చేయడం దారుణమన్నారు. ఎఐసిసి కార్యదర్శి క్రిస్టోఫర్ మాట్లాడుతూ విభజించు - పాలించు మాదిరిగా కేంద్రంలో బిజెపి పాలన సాగుతోందని విమర్శించారు. యువశక్తిని ఉపయోగించుకోలేని స్థితిలో కేంద్రం ఉందన్నారు. 2024లో జరగనున్న ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్ సింగిల్ అజెండా ప్రత్యేక హోదా అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు గొంప గోవిందరాజు, యూత్ కాంగ్రెస్ నాయకులు భగత్, శిరీష్, చినబాబు, మనుకుమార్, శివ, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

మత్స్యకారులు సురక్షితం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సముద్రంలో ఆపదలో ఉన్న మత్స్యకారులను ఇండియన్ కోస్ట్ గార్డ్ దళం రక్షించింది. వివరాల్లోకి వెళితే.. ఓ ఫిషింగ్ బోట్ గణపతి పెరుమాళ్ ఆధ్వర్యంలో కాసిమేడు నౌకాశ్రయం నుంచి ఆగస్టు 24న చేపల వేటకు బయలుదేరింది. బోట్ మెషినరీ దెబ్బతిన్నప్పటికీ సెప్టెంబర్ 1 నుంచి డ్రిఫ్టింగ్‌ను కొనసాగించింది. కోస్ట్ గార్డ్ నౌకలు విమానం సాయంతో చెన్నయ్ 240 వద్ద బోటును గుర్తించాయి. కోస్ట్ గార్డ్ షిప్ వచ్చే వరకు పడవను పర్యవేక్షించవలసిందిగా ఎంఆర్‌సి చెన్నయ్ సమీపంలోని నౌక ఎంవి జగ్‌రాధను అభ్యర్థించారు. ఈ క్రమంలోనే ఇండియన్ కోస్ట్ గార్డ్ షిప్ ఆయుష్ ఈ నెల 6న అక్కడకు చేరుకుని తొమ్మిది మందిని రక్షించింది. అనంతరం ఆ బోటును విశాఖ మత్స్యశాఖకు అప్పగించింది.